ఉగాది అభినందనలతో

దికరోల్

కాస్మెటిక్స్ & మెడికమెంట్సు

హైదరాబాదు


**The Karol Kosmetics & Medicaments**

HYDERABAD.




# మాయాతీత స్వరూపిణో!

రామలక్ష్మి



ఈరోజు నాకు 'స్త్రీ' అంటే ఎవరో యేమో స్పష్టంగా అర్థమయింది. అలా అర్థమవడానికి ముందు చావుదెబ్బలు తినవలసినంతపని అయింది. దానికంతకూకారణం మాఅన్నయ్య చాదస్తమో, నా సినిమా వ్యామోహమో? ఏదేమైనా జీవితంలో ఒకమంచి అనుభవం అది! తెలుసుకున్న అమోఘ సత్యమే నాపాలిట!

ఆరోజు అసాధారణంగా తయారయాను; ఇలా అలాకాదు - అపూర్వంగా....ఒకసారి అద్దంలో చూసుకొని, నన్ను నేనే ప్రేమించు కొని వెనక్కు తిరిగానో లేదో అన్నయ్య ఎదురు....

ఒంటి బ్రాహ్మణుడని ఎవరు లెక్క చేస్తున్నారు కానీ - శుద్ధ బ్రాహ్మణుడి అవతారం.

మా అన్నయ్య నొకసారి చూస్తే చాలు ఎవరికైనా తెలిసిపోతుంది - పరమ ఛాందసుడు. పూర్వాచార పరాయణుడని. చూస్తే నిండా ముప్పయ్యేళ్ళు కూడా వుండవు - ఏమిటో మరి - నుదుటిమీద ఆ విభూతి రేఖలపైన నయాపైసంత బొట్టు. తెల్లని ధోవతి; పైన కంఠాన్ని కప్పుకొన్న వెడల్పాటి శాలువ; కనీ కనిపించకుండా క్రాపులో దాగిన పిలక.

ఎంతకోపం వచ్చినా ప్రవరాఖ్యుడిలాంటి అన్నయ్యను చూడగానే యెక్కడికో పోతుంది అదంతా.

వదిన ఆజ్ఞాపించదెందుచేతనో గాని, ట్వీడ్ సూటుగనక వేశాడంటే ఏ కాలేజీ 'వరూధినో' వున్న పళాన అన్నయ్య కాళ్ళ మీదపడదూ? ఈ వదిన వున్నదే ఆవిడ ఒక రకపు పతివ్రతా శిరోమణి. మళ్ళీ ఇద్దరికీ అప్పుడప్పుడు గిల్లికజ్జాలు రాకనూపోవు.

'సరే! మనుషులకు మనుషులెదురవక పోతే మానులెదురౌతాయా?' అంటూ ఒక సామెతను అడ్డదిడ్డంగా తయారుచేసుకుని ముందుకు నడవబోయాను.

అన్నయ్యకు గట్టి అనుమానం తగిలి నట్టుంది. అప్పుడే లోపలిగదిలో నుండి గుమ్మంలోకి అడుగుపెట్టిన వదినను నిలేసి "వాడెక్కడికి వెళ్తున్నట్టు?" అని అడిగాడు. ఇలాటి ప్రశ్నలకి జవాబులు చెప్పవలసి రావడం అలవాటే ఆవిడకి.



"పట్నంకాబోలు - కొత్త సినిమా వచ్చిందట!"

వదిన జవాబు వింటూనే నావైపు తిరిగి చూశాడు అన్నయ్య.

"అంతేనా? ఏమిట్రా ఈ సినిమా పిచ్చి నీకు వదలదా? అక్కడ ఉన్నన్నాళ్ళూ లక్ష సినిమాలు చూసుంటావుకదా - ఇంకొన్నాళ్ళు ఇలా చూస్తే పిచ్చెత్తిపోతావు...."

"ఉండన్నయ్యా: శపించకు, నాకు కాలేజి చదువెందుకు చెప్పించావు? అదే పొరబాటు. నీకు తెలీదుకాని ఈనాడు కాలేజీకి, సినిమాకి అవినాభావ సంబంధం ఉంది. సాధారణంగా రెండూ ఒక్కచోట తటస్థ పడుతుంటాయి."

"ఏడిశావు: ఆ అష్టమస్కంధం పూర్తి చెయ్యరా అని మొత్తుకున్నా విన్నావుకావు. అయితే ఎన్నిగంటలకి తిరిగి తమరి రాక?"

"రాత్రి పదకొండింటికి వచ్చేస్తాగా!"

నాకు తెలుసు-అన్నయ్య ఒప్పుకుంటాడని. మా అన్నయ్య దృష్టిలో నేనొక తల్లి, తండ్రి, ఉద్యోగంలేని పాతికేళ్ళ పనికిరాని వెధవని. అదిగాక మా అన్నయ్య మాటకు వ్యతిరేకంగా పోతేనే నాకు శుభం కలుగుతుందని నా నమ్మకం.

● ● ●

ఆ ఘట్టమలా గడిచింది. నా ఖర్మ కాకపోతే ఎప్పుడూ తప్పని ఆఖరిబస్సు ఆ రోజలాతప్పిపోవాలా? తప్పిపోతేపోయింది. ఏసత్రంలోనో మేనువాల్చి తెల్లారాక వూరు పోయివుంటే ఎటువంటి బాధా, ఏ గాధా లేకపోను. ఆపద్బాంధవుడికిమల్లే ఆ స్నేహితుడు ఆదుకోవడమేమిటి? స్నేహితులు కాకపోతే చెట్లాదుకుంటాయా? అంటారు కొందరు. అదీనిజమేకాని - ఆ స్నేహితుడికి ఒక అప్సరసవంటి చెల్లెలుండడమే నా



దురదృష్టం. ఆవిడైనా అలా అపరంజి బొమ్మలా కదలక మెదలక ఊరుకుంటే తనకి నష్టమేమీలేకపోను. ఎటొచ్చీ ఆవిడ తన సౌందర్యాన్ని విజృంభింపజేసి అనేక విధాల ప్రదర్శించడమే నా పాలిట ప్రమాదంగా పరిణమించింది.

● ● ●

ప్రొద్దున్న లేవగానే - ఆరోజుకి అక్కడే వుండిపోవలసిందని బలవంతపెట్టాడు మా గోపాలం - నా స్నేహితుడు. పైగా నేను గనక తన యింట్లో ఉండకపోతే ఏదో 'సర్వకర్మపరిత్యాగం' అట - అలాటి వేవో నాలుగైదు చేస్తానంటూ ప్రమాణాలు ప్రవచించాడు కూడా.

కాదు వెళ్ళిపోవాలంటున్నాను; అంతలో ఆవతలిగదిలో ఆ అమ్మాయి కనిపించడం, నా బెట్టుసరి గొంతుకను ఏదో అడ్డగించడం ఒక్కమారే జరిగిపోయినాయి. ఆ రూపరేఖావిలాసాలు, మిడిసిపాటు, అలక్ష్యం. అవన్నీ చూస్తుంటే అవివాహితలా గే తోచింది. నా దగ్గరా ఏదైనా సాగడం? ఆవులిస్తే పేగులు లెక్కిస్తాను.


అప్రయత్నంగానే నా సంభాషణ ధోరణి మారింది.

"మీ ఇల్లొక లక్ష్మీవిహార్‌లా కనిపిస్తుందోయ్!" అన్నాను ద్విభావ సమ్మేళనంతో.

"మమ్మల్ని పొగిడేస్తున్నావ్ కాని నీకేంతోటు? ప్రక్కను హిమాలయమంత అన్న ఉన్నాడు; ఏ చైనావాడూ నీమీదకు దాడి చెయ్యలేడు." గోపాలం గోల.

"నువ్వన్నది రైటే! మా అన్నయ్యా వదినా సాక్షాత్ సీతా రాములైతే నేను లక్ష్మణదేవరనే! అయితే రోజూ అష్టమస్కంధాలూ, అరణ్యకాండలూ చదవలేక చస్తున్నాను. ఎంతేనా బి. ఏ. చదివినవాణ్ణి. రేపో మాపో ఒకమాదిరి ఉద్యోగం, చిక్కక






పోదు. అన్నిచోట్లకీ అప్లికేషన్లు పారేశాను....ఇంక ఇంటర్వ్యూ ఆర్డర్స్‌కోసం జపం చేస్తూ, అన్నయ్య ఆజ్ఞ ప్రకారం రామాయణాదులు పారాయణం సాగించడంలో వున్నాను...."

"ఐనా మీ అన్నయ్యకి మంచివ్యక్తిత్వం ఉన్నదోయ్! లేకపోతే నువ్విలా జడవవు."

చెప్పొద్దూ. అన్నయ్యని పొగిడితే నన్ను పొగిడినంత తబ్బిబ్బవుతాను.

గుమ్మంవద్ద అలికిడై అవంకచూశాము. మెరుపుతీగ....! అంతవరకు నాకళ్ళల్లోనే మెదులుతున్న అప్సరస తిన్నగా టీ కప్పులు ధరించిన హస్తాలతో, చిరునవ్వు ధరించిన అధరాలతో వచ్చేస్తూంది....

నాలో వివేకం నన్నాగమని సైగచేసింది. కానీ ఆలోచన అంతమవలేదు....ఎవరీ తటిల్లత? అని మనసులో ప్రశ్న వేసుకుని సందేహ నివృత్తికోసం గోపాలం వైపు చూశాను. నాఊహ సరైనదే. ఆపిల్ల అతని చెల్లెలే. పైగా ఆ తటిల్లత పేరు 'హేమలత'ట. రెండుసార్లు - ఆ భామాతిలకాన్ని

హేమ సుమ లతికను పరికించాను. లక్ష్మీ స్వరూపంవలె సాక్షాత్కరించిన ఆమె నా పాలిట వరలక్ష్మి అయితే మరింత బాగుం డును అనే దురాశా జనిత దురూహ హృద యంలో మసిలిపోయింది.

లోలోపల ప్రవహిస్తున్న ప్రశాంతా నందతరంగిణి, సుందరతర స్వప్నవాహినిని జోడుచేసుకుని వెల్లువై పొర్లడానికి ఉద్రిక్త తౌతున్నది.

గోపాలం అపార్థాలు చేసుకోని మంచి మిత్రుడు. అతని సహృదయానికి సాక్షిగా మేం ఒకరి కొకరం బాగా పరిచయ మయ్యాం.

• • •

ఆ సాయంత్రం నా అభ్యర్థనను ఆమె త్రోసిపుచ్చలేదు. నాతోపాటు బీచి విహారా నికి అంగీకరించింది. కాకపోతే ఆమె హృదయపూర్వకంగా వస్తున్నదో, మొగ మాటానికి వస్తున్నదో మాత్రమే గ్రహించ ప్రయత్నించలేదు నేను.

ఆమెలోని ఆకర్షణ నాలో నూతన చైత న్యాన్ని ఆవిర్భవింపచేస్తోంది. కాలేజీ యువతులతో అతిచతురంగా మాట్లాడడమే తప్ప యిటువంటి అనుభవం మాత్రం ఎప్పుడూ కలగలేదు——

ఎన్నడూలేని ఉత్సాహం నిరర్గళంగా ఉరకలు వేసింది, ఆనందపుటంచుల నందు కుంటున్నాను. మామధ్య చనువు అధిక మౌతున్నకొద్దీ నా ధైర్యంకూడా ఇనుమ డించింది.

"ఒకపాట పాడండి!" అన్నాను చల్లని తడిగాలిని అనుభవిస్తూ.

ఆమె పాటను అటువంటి సమయంలో నేను కోరడానికి కారణం లేకపోలేదు. మొదటి వీక్షణంలోనే ఆమె సాక్షాత్తు లక్ష్మీ మూర్తిగా కనిపించింది. ఆ తరువాత గానం సరస్వతీదేవికి వారసు రాలనిపించుతుంది. అన్నింటా శేషనిపించుకుంది. పైగా స్నేహి తుణ్ణయాను ఇప్పుడు.

అందుకే సాహసించగలిగాను - ఒక పాట పాడమని అడగటానికి.

"సరే" అంది-మధురగళాన్ని విప్పింది. ఒక గీతం-కాదు వేయిగీతాల సాటి అయిన మధుర గీతం. శ్రుతిమధురమైన గానాన్ని పొగడలేని వాళ్ళుంటారా?

అభినందించాను.

"పొగడటంలో ప్రవీణులే" అంది పడ మటి అస్తమయ కాంతిని చూస్తూ.

"పొగడటంలో ఏముంది? మీరు లక్ష్మీ సరస్వతుల ప్రతిబింబంగా కనిపిస్తున్నారు"

"ఇంకా తక్కువచేశారు" నవ్వుతూ అంది.

వెలుగు నీడల తెర వున్నట్లుండి జారింది మామధ్య. కంగారు పడుతూ లేచింది ఆమె "పదండి! చీకటి పడుతున్నది."

హృదయం చంచలంగా స్పందించింది. ఆందోళిత మనస్కుణ్ణయాను. ఏదో పోగొ ట్టుకున్నప్పటి తత్తరపాటు.

"హేమా! మీతో ఒకటి చెప్పాలి!"

"ఏమిటి?" నావైపు చూస్తూ అడిగింది.

కొద్ది వెలుగులో ఆమె ముఖకవళికలు మారడం స్పష్టా స్పష్టంగా తెలుస్తున్నది.


ఆమెతోపాటు మెల్లగా అడుగులు వేస్తూ అన్నాను:

"నాపైన మీకెటువంటి అభిప్రాయం ఉంది?"

"మంచి స్నేహితులు అనిపిస్తున్నారు."

"ఈ స్నేహాన్ని పటిష్ఠం చేసేమార్గం లేదంటారా?"






"అంటే?"

"హేమా! మనిద్దరం వివాహం చేసు కుంటే బావుంటుందని నా అభిప్రాయం.... మరి మీ ఉద్దేశ్యం....ఏటు"

"ఛీ!"

ఉలిక్కిపడ్డాను. అంతవరకు అతి సహజంగా వుండిన ఆమె యీమాటకి యింత అసహ్యపడి పోతుందని అనుకో లేదు.

"క్షమించండి....స్నేహానికి వివాహానికి లంకె పెడుతుంటే ఒప్పుకోలేక పోయాను. అంతే!" గొంతు తగ్గించి అంది.

నమ్మలేక పోయాను ఆమె కఠినత్వాన్ని. అవమానం కలిగింది.

"స్నేహం నుంచే కదా ప్రేమలోకి దిగటం - ప్రేమ వివాహానికి దారితీస్తుంది." అన్నాను కాలేజి జ్ఞానాన్ని వుపయోగించి.

"ఇప్పుడు ప్రేమ ప్రస్తావనదేనికి?" ఆమె కనుబొమలు ముడివడ్డాయి.

ఆమెను ఏడిపించాలనిపించింది అప్ప టికి - మగవాణ్ణి కాబట్టి.

"నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను." అనేశాను చటీమని.

ఇంకేమిటి? ఊహించిన ఉరుములే ఉరిమాయి; అనుకున్న పిడుగులే రాలాయి.

"ఛీ! బ్రూట్స్! కొంచెమయినా మర్యాద అనేదిలేదు...."సణుగుతూ అని-

"చూడండి మిష్టర్: మీలాటివాళ్ళతో మాకు పడదు. మీకు కావలిసినవి స్నేహాలు కావు....అర్థ విహీనమైన ప్రణయాలు. అలాటి వెక్కడ లభిస్తాయో వెదుక్కోండి. ఒకస్త్రీకి, పురుషుడికి మధ్య స్నేహం నిలవ దని నిరూపించారు. ఇంకోసారి యిల్లాంటి ప్రయోగాలు చెయ్యబోయారంటే - ఇప్పుడు నోటితో అయింది - ఆనక చేత్తో మహిమ చూపించవలసి వుంటుంది. నమస్తే!" రివ్వున వెళ్ళిపోయింది మెరుపుతీగ.

స్వల్పకాలమే కట్టెదుట కమనీయంగా మెరిసినా: కలకాలం కళ్ళవెనుక నిలచి పోయే విద్యుల్లత!!

స్త్రీగా మిగిలిన శక్తిస్వరూపాన్ని కూడా చూపి వెళ్ళిపోయింది. చిత్రం! ఎంతలో యెంత జరిగింది!

• • •

ఇంటికి వచ్చిపడేవరకు ఊపిరాడలేదు. పదిరోజులనుంచి ఆమె ప్రవర్తననుగురించి ఆలోచించగా ఆలోచించగా 'యిప్పుడు తెలి సింది 'స్త్రీ' అంటే ఎటువంటి శక్తిస్వరూ పిణో; ప్రతిస్త్రీలోను లక్ష్మీ సరస్వతుల ప్రభావమేగాక అంతో యింతో 'దుర్గాంశ' వుంటుంది. సమయానుకూలంగా తన వరా లను వినియుక్త పరుచుకుంటుందన్నమాట ఆడది. ఎంత అవమానం జరిగినా - ఆ

# పచ్చవ పాపయ్య, ముప్పా నారాయణరావు

(స్థాపితం 1918)

సున్నం, బొగ్గు, ఎరువులు, వ్యాపారం.

పోష్టు బాక్సు నెం. 11

టెలిఫోను నెం. 139
టెలిగ్రాం : లైంకోల్

**విజయవాడ-1**

మావద్ద అన్నిరకముల బొగ్గు అనగా పొగాకు బారనులకు, సున్నం బట్టీలకు, ఇటుక బట్టీలకు పనికివచ్చు సింగరేణి స్టీంకోలు, సింగరేణి షేలుబొగ్గు, సింగరేణి బూరబొగ్గు దొరకును.

ఇనుప ఫౌండ్రీలకు పనికివచ్చు హార్డుకోకున్నూ, ఇంట్లో వంటకు పనికివచ్చు సాఫ్టుకోకు బొగ్గున్నూ దొరకును.

అన్ని పైరులకు, నారుమళ్ళకు, పనికివచ్చు ప్యారీ & కంపెనీ వారిచే తయారు చేయబడిన పుష్టికరమైన మిశ్రమ యెరువులు, సూపరు ఫాస్పేటు, బోనుసూపరు ఫాస్పేటు, అమ్మోనియం ఫాస్పేటు వగైరా యెరువులన్నియు దొరకును.

వర్జీనియా పొగాకు క్యూరింగు చేయుటకు పనికివచ్చు ప్రశస్తమైన టెయిలర్ ఇన్‌స్ట్రుమెంట్సు కంపెనీవారిచే తయారు చేయబడిన టెయిలరు క్యూరోమీటర్లు దొరకును —







గు ప్తరహస్యాన్ని, నిగూఢ సత్యాన్ని తెలుసుకున్నందుకే శిఖరారోహణ చేసినంత ఆనందంగా వుంది.

అదుగో అన్నయ్య వస్తున్నాడు....దశమస్కంధంలో డెబ్భయ్యోపేజీ చదివినట్లు చెప్పాలి - అరె! అరుదైన చిరునవ్వు ప్రకాశిస్తూందే మా అన్నయ్య పెదాలమీద. ఇవాళ ఏదో విశేషం వుండాలి మరి—

లోపలికివస్తూనే అడిగేశాడు అన్నయ్య! "ఏమిరా అలా వున్నావ్?"

"అన్నయా! మరేమో .... దశమ." తడబడ్డాను.

"అదిసరేలే! ఈవేళ నీతో ఒకవిషయం మాట్లాడాలి...."

"ఏమిటన్నయ్యా అది?"

వదినను కేకేశాడు. ఆవిడ వచ్చి అన్నయ్య అరుదైన మాటలు చెవులు రిక్కించి వినసాగింది.

"నీ స్నేహితుడట-గోపాలకృష్ణమూర్తి. ఆయన నాకు తెలియకపోయినా నేనాయనకి తెలుసట. బజార్లో కలుసుకుని కొంతసేపు మాట్లాడి వెళ్ళాడు. సారాంశం - వాళ్ళ చెల్లెలు నిన్ను పెళ్ళిచేసుకోవాలని నిర్ణయించుకుందట. మన అభిప్రాయాలు ఎలా వుంటాయోనని నన్ను అడిగాడు. మనవారే కాబట్టి 'మిగిలిందంతా 'నా తమ్ముడియిష్టం' అని చెప్పేశాన్నేను. ఏమంటావ్? నువ్వింతకుముందు అమ్మాయిని చూశావటకదూ?"

ఉక్కిరి బిక్కిరయింది నావని. మెదడులో ఆలోచనల రైలు గరంయిన పోతుంటే అనుకోకుండా సిగ్నల్ పడినట్లు వెనువెంటనే ప్రశ్న.

"ఆఁ!, మొన్న వెళ్ళినప్పుడే చూశాను."

నా సమాధానానికి వదిన ముక్కుపుడక ఫక్కున నవ్వింది.

"అబ్బాయిగారు మాకు చెప్పకుండానే పెళ్ళిచూపులు నడిపారన్నమాట!" నాకు ఉన్న మతిపోయింది.

'అతివ అంటే ఎవరు?' అని నన్ను నేను ప్రశ్నించుకొనేలోగా —

అన్నయ్యకూడా వదినతో నవ్వులు కలిపాడు. □□□

వచ్చే సంచికలో

**స్నేహితులు**

మధురానుభూతులతో
మనసును నింపే పెద్దకథ

రచన :
కొడవటిగంటి
కుటుంబరావు